సాక్షి జగిత్యాల

ఆదివారం । 30 । మార్చి । 2025



మ్యాథమేటిక్ క్యాలిక్యులేషన్



జగిత్యాలటౌన్: విశ్వావసునామ సంవత్సరంలో ప్రజలందరికీ శుభాలు కలుగుతాయి. నలభై ఏళ్లుగా జగిత్యాల పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఏటా పంచాంగ పఠనం వినిపిస్తున్న. పంచాంగం ఒక మ్యాథమేటిక్ క్యాలిక్యులేషన్. ఆ క్యాలిక్యులేషన్ ప్రకారం సూర్యునికి రాజు పదవి, చంద్రునికి మంత్రి పదవి రావడంతో పాటు నవగ్రహాలలో 3 శుభగ్రహాలకు చక్కని ఆధిపత్యం దక్కినందున పాలనలో మరింత ఆధిపత్యం పెరిగి ప్రజలకు సత్ఫలితాలు లభిస్తాయి.

– శ్రీమాన్ నంబివేణుగోపాలాచార్య, జగిత్యాల

నవ విశ్వాసం

- నేడు విశ్వావసునామ ఉగాది పర్వదినం
- ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలకు ఆలయాలు సిద్ధం

కష్టసుఖాల కలయికలతో తీపి, చేదు జ్ఞాపకాల క్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. వనాలన్నీ చిగురించే వేళ, పూల పరిమళాలు వెదజల్లే వేళ.. కోయిలమ్మల కుహుకుహూ రాగాలు.. హాయినిచ్చే వెచ్చని గాలులు.. వెలుగులు పంచే విశ్వావసునామ తెలుగు సంవత్సరానికి తెలుగు ప్రజలు ఆదివారం ఘనస్వాగతం పలికేందుకు సిద్ధం అయ్యారు. వసంత రుతువు ఆగమనంతో చైత్రశుద్ధ పాడ్యమి సూర్యోదయం నుంచి తెలుగు నూతన సంవత్సర ఉగాది జరుపుకోవడం ఆనవాయితీ. ఉగాది అంటే కష్టసుఖాల కలయిక. షడ్రుచుల వేడుక. నూతన వస్త్రధారణ, ఆలయాల సందర్శనం, ఇష్ట దైవాల ఆరాధనతో పాటు.. ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు, పిండి వంటల తయారీ పండుగ ప్రత్యేకం. నేడు విశ్వావసునామ ఉగాది పర్వదినం సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రముఖ పంచాంగ పండితులు, కవులు, అలనాటి పండుగ వేడుకలు, మారిన కాలంలో ఉగాధి ఉషస్సులు, పలు ఆలయాల్లో ప్రత్యేకతలు తదితర అంశాలతో కథనం.

- వివరాలు 8లో▸

అర్చకులకు పురస్కారాలు

కరీంనగర్‌కల్చరల్: ఉమ్మడిజిల్లాకు చెందిన పలువురు అర్చకులకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాలు ప్రకటించింది. కొండగట్టు ఆలయ అర్చకుడు టి.కపీందర్‌స్వామి, కరీంనగర్ మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు పి.నరసింహాచార్యులు, వేములవాడ ఆలయ అర్చకుడు జగన్‌మోహన్ ఉపాధ్యాయుల, కే.వెంకటయ్య ఉన్నారు. దీపదూప నైవేద్య అర్చకుల్లో కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ శివాలయం అర్చకుడు పి.శివప్రసాద్ ఉన్నారు. వీరిని నేడు హైదరాబాద్ రవీంద్రభారతిలో సత్కరించనున్నారు.

ఓదెల మల్లన్న సన్నిధిలో వాహన పూజలు

ఓదెల: పెద్దపల్లి జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఉగాది పండుగ రోజున వాహనాల పూజలు నిర్వహిస్తుంటారు. ఉగాది రోజున వాహన పూజలు చేస్తే అంతా శుభం జరుగుతుందని నమ్ముతుంటారు. పండుగ రోజున మల్లన్న ఆలయం వాహనాల పూజలతో కిక్కిరిసిపోతుంది. పూజలకు వచ్చే భక్తుల కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

58 ఏళ్లుగా పంచాంగ పఠనం



ముస్తాబాద్(సిరిసిల్ల): ఉగాది పంచాంగ పఠనం 1967నుంచి చేస్తున్న. మా నాన్న గారు పరమపదించాక పౌరోహిత్యం చేపట్టాను. తెలుగు సంవత్సరాలు అరవై ఉండగా, మరో రెండేళ్ల గడిస్తే అన్ని సంవత్సరాలకు పఠనం చేసిన వ్యక్తిగా నిలుస్తా. ఆ రోజుల్లో ఉగాది రోజు మద్దికుంట శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి ఊరంతా వచ్చేవారు. పాడి, పంట, వర్షాలు, ఆదాయ వ్యయాలను రైతులు అడిగి తెలుసుకునేవారు. ఇప్పుడు సోషల్ మీడియాలో ముందుగానే తెలుసుకుంటున్నారు. నేను రైతుగా, ప్రజాప్రతినిధిగా, ఆలయ అర్చకులుగా గ్రామానికి విశిష్ట సేవలను అందించాను.

– మెట్టు రామశర్మ, మద్దికుంట, సిరిసిల్ల

బీర్‌పూర్ నృసింహుని సన్నిధిలో జిల్లా జడ్జి



స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న జిల్లా జడ్జి నీలిమ

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామిని జిల్లా జడ్జి నీలిమ శనివారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో వచ్చిన ఆమెకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి, ఆలయ ప్రధాన అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోష్, చిన్న సంతోష్, మధుకుమార్, హేమంతాచార్యులు, జూనియర్ అసిస్టెంటు రఘు ఉన్నారు.

ఫిల్టర్‌బెడ్ ద్వారా గ్రామాలకు రక్షిత నీరు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ

జగిత్యాల/జగిత్యాలరూరల్/జగిత్యాలటౌన్/రాయికల్: ఫిల్టర్‌బెడ్ల ద్వారా త్వరలో గ్రామాలకు రక్షిత మంచినీరు అందిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాలరూరల్ మండలం పొలాస శివారులోని ఫిల్టర్‌బెడ్ మరమ్మతు పనులను పరిశీలించారు. పొలాస నుంచి కల్లెడ వరకు నీటి సరఫరా ఉంటుందన్నారు. అంతకుముందు ఆయన పొలాస శివారులోని పౌలస్తేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

సంవిధాన రక్షణకు కృషి చేయాలి

భారత్ సంవిధాన పరిరక్షణకు కృషిచేయాలని విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జిల్లా పరిశీలకులు రియాజ్ అన్నారు. జైబా పు, జైభీం, జైసంవిధాన్ సన్నాహక సమావేశం శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. సంవిధాన్ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. వివిధ గ్రామాలకు చెందిన 312మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

మిషన్‌భగీరథ నీరు అందించాలి

మిషన్ భగీరథ నీటిని ఇంటింటికీ అందించేలా చర్యలు తీసుకోవాలని విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. తాగునీటి ఇబ్బందులు రానీయొద్దన్నారు. కార్యక్రమాల్లో అధికా రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మతసామరస్యానికిప్రతీక రంజాన్

మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో మున్సు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. తహసీల్దార్ ఖయ్యూం, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరి షాకీర్, నబీ, శంషేర్, మొబిన్, మసూద్, ఖలీల్ పాల్గొన్నారు.

పాలన వైఫల్యంతో ప్రజలకు ఇబ్బందులు



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

మల్లాపూర్: కాంగ్రెస్ పాలన వైఫల్యంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై దృష్టి సారించకుండా బీఆర్‌ఎస్‌ను దూషించడమే పనిగా పెట్టుకున్నారని, 15 నెలల పాలనలో తెలంగాణ ఐదేళ్ల వెనక్కి వెళ్లిందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి కొట్లాడుతానన్నారు. పథకాలు మంజూరు చేయిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసిందని, అలాంటి వారి చెంప చెల్లుమనిపించాలని సూచించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపెల్లి సరోజన, మాజీ వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి, నాయకులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

మెట్‌పల్లి: ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే సంజయ్ సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడారు. కొత్త భవన నిర్మాణ పనులు నిలిచిపోయిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, నిధులు త్వరలోనే వస్తాయని తెలిపారు. మందుల కొరత ఉందని సిబ్బంది చెప్పగా.. సంబంధిత అధికారితో ఫోన్‌లో మాట్లాడి తెప్పించాలని సూచించారు.

చేపల వేటకు వెళ్లి విద్యుత్‌షాక్‌తో మృతి

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన చింతకుంట్ల రాజనర్సయ్య (58) అనే వ్యక్తి శనివారం చేపల వేటకు వెళ్లి విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. రాజనర్సయ్య శనివారం ఉదయం గ్రామ శివారులోని వాగులో చేపల వేటకు వెళ్లాడు. వాగులో కరెంట్ షాక్ పెట్టి చేపలు పడుతున్న సమయంలో తీగలు తీయకుండానే వాగులోకి వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి


లక్ష్మీనర్సు (ఫైల్)

కోరుట్ల రూరల్: మండలంలోని నాగులపేట గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ కుంట లక్ష్మీనర్సు (55)గుండెపోటుతో మృతిచెందారు. లక్ష్మీనర్సు ఎప్పటిలాగే కూలికి వెళ్లింది. తోటికూలీలతో కలిసి కాలువ పూడికతీత పనులు చేస్తుండగా అకస్మాత్తుగా అస్వస్థతకు గురైంది. అక్కడే కుప్పకూలింది. కూలీలు 108లో కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే లక్ష్మీనర్సు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. లక్ష్మీనర్సుకు కుమారుడు, కూతురు ఉన్నారు.

నవ విశ్వాసం





- తరాలు మారుతున్నా.. తరగని సంప్రదాయం
- నాటి కట్టు, బొట్టుతో ఇష్టదైవాల ఆరాధన
- నేడు ఉగాది పండుగ

కాలాగమనంలో మరో తెలుగు సంవత్సరం గతించింది.. కొత్త ఆశలు.. సరికొత్త ఊసులతో విశ్వావసు నామసంవత్సరం ఆదివారం ఆరంభమవుతుంది. చీకటి వెలుగులున్న ప్రపంచంలాగే కష్టసుఖాల కలబోతగా మనిషి జీవితం సారూప్యతను కలిగి ఉంటుందనే నిజాన్ని ప్రతీకాత్మకంగా పట్టి చూపించేదే ఉగాది. తీపి చేదులతో పాటు షడ్రుచుల సమ్మేళనంతో కూడిన పచ్చడి సేవనం కూడా జీవితంలో ఆటుపోట్లను సమంగా స్వీకరించాలనే తాత్వికతను సంబోధిస్తుందీ పండుగ. ఇష్ట దైవాల ఆరాధనతో రాబోయే ఏడాదంతా సుఖ సంతోషాలను ప్రసాదించాలనే ఆకాంక్షతో ప్రజలు ప్రార్థన జరిపే పండుగ. కానీ...మారిన కాలమాన పరిస్థితుల్లో పండుగల ప్రత్యేకత క్షీణిస్తుంది. పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా ప్రపంచీకరణ ప్రభావంతో 'సెల్' మాయాజాలంలో పండుగలు విశిష్టతను కోల్పోతున్నాయి. ఈనేపథ్యంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని పలువురు సంప్రదాయాలను పాటిస్తున్నారు. నాటి కట్టు, బొట్టుతో పండుగల విశిష్టతను కాపాడుతున్నారు. ఆదివారం విశ్వావసు ఉగాది సందర్భంగా ప్రత్యేక కథనం..!!

పంటలు సమృద్ధిగా..



మంథని: విశ్వావసు నామ సంవత్సరంలో పంటలు సమృద్ధిగా పండే అవకాశం ఉంది. పత్తి, వరి, తెల్ల జొన్నలు వంటి పంటలు ఎక్కువగా లాభాలనిస్తాయి. పాలకుల మధ్య విభేదాలతో ప్రజలకు కొంత అసౌఖ్యం కల్గుతుంది. అయినా ప్రజల్లో స్నేహభావంతో మేలు జరుగుతుంది. భయాందోళనకర వాతావరణం ఉన్నా భగవతారాధన వల్ల అందరూ సుభిక్షింగా ఉంటారు. బంగారం, లోహ సంబంధిత వస్తువుల ధరలు అందుబాటులో ఉండే అవకాశం ఉంది.

– వొజ్జల గణేశ్ అవధాని, వేద పండితుడు, మంథని

35 వసంతాలుగా..



గోదావరిఖనిటౌన్(రామగుండం): ఉగాది అనగా యుగానికి ఆది అని అర్థం. 35 ఏళ్లుగా గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీలోని శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయంలో పంచాంగ శ్రవణం వినిపిస్తున్న. ఈ ఉగాది విశ్వావసు సంవత్సరం అనగా 11 మంది గంధర్వులలో విశ్వావసుడు ఒకరు. విశ్వావసుడు ప్రేమకు ప్రతీక. ప్రజల మధ్య ప్రేమానురాగాలను కలిగిస్తాడు. ఇది శుభ సంవత్సరం. ఉగాది రోజు ఉదయాన్నే అభ్యంగన స్నానం చేయాలి. అనగా ఒంటికి నూనె రాసుకొని తెల్లవారక ముందే స్నానం చేయడం వల్ల ఆరోగ్యం ప్రాప్తిస్తుంది. ఈ రోజు ధ్వజారోహణము చేసి, ఇంటిపై ధ్వజమును ఎగురవేయాలి.

– వొజ్జల వెంకటేశ్వరశర్మ, గోదావరిఖని

మా తాతల కాలం నుంచి..



బోయినపల్లి(చొప్పదండి): మండలకేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో 25 ఏళ్లగా ఉగాది రోజున పంచాంగ శ్రవణం చేయడం ఆనవాయితీగా వస్తోంది. మా వంశంలో తాతలు, తండ్రుల కాలం నుంచి పంచాంగ శ్రవణం చేస్తున్నం. ప్రస్తుత విశ్వావసు నామ సంవత్సరంలో రవి రాజుగా వస్తున్నారు. పంచాంగ శ్రవణంలో రాశిఫలాలు, ఆదాయ వ్యయాలు, ధాన్యాధిపతి గూర్చి, ఎన్ని తూముల వర్షాలు కురుస్తాయి, పంటలు ఎన్ని పుట్లు పండుతాయి, రాజ్యాధికారం ఎలా ఉంటుంది, స్త్రీ, పురుష జనన ఉత్పత్తి తదితర వివరాలు చెబుతాం. ఉగాది రోజు ప్రజలు పంచాంగ శ్రవణం వినడానికి వచ్చి తమ రాశి ఫలితాలు ఎలా ఉన్నాయో తెలుసుకుంటారు.

– శ్రీనివాసాచార్యులు, బోయినపల్లి

విశ్వశాంతికి పునాది



శిశిర ఋతువుకు వీడ్కోలు పలికి వసంత ఋతువుకు స్వాగతం పలుకుతున్న వేళ ఆరంభం అవుతున్న శ్రీ విశ్వావసు నామ సంవత్సరం విశ్వానికి సంబంధించినది. ఈ సంవత్సరం శుభఫలితాలు ఎక్కువగా ఉన్నాయి. వ్యాపారులకు మంచి లాభాలు వస్తాయి. కుటుంబ జీవితాలలోను సంతోషంగా ఉంటుంది. దేశాల మధ్య వైరం, యుద్ధ వాతావరణం నుంచి ఉపశమనం లభించే అవకాశాలున్నాయి. విశ్వావసు అంటే ప్రపంచానికి మేలు చేసేవాడు.. అంటే ప్రజలు సహాయక స్వభావం కలిగి ఉంటారు.

– నమిలకొండ రమణాచార్యులు, కరీంనగర్

ఏటా కవి సమ్మేళనాలు



కోరుట్ల: స్వేచ్ఛ సాహితీ సమితి.. కోరుట్లలో బహుజన కవిత్వానికి పెట్టింది పేరు. ఏటా స్వేచ్ఛ సాహితీ సమితి ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనాలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. కవి రాస భూమయ్య అధ్యక్షతన ఏర్పాటైన సాహితీ స మితి కేవలం ఉగాది కవి సమ్మేళనాలకు పరిమితం కాకుండా అభద్రతతో ఉన్న వృద్ధులు, మహిళలు, పిల్లలకు చేయూతగా నిలుస్తుంది.

ఊహ తెలిసినప్పటి నుంచి..



ఇల్లంతకుంట(మానకొండూర్): మాది ఇల్లంతకుంట మండల కేంద్రం. విద్యాభ్యాసం ముగిసిన నాటి నుంచి 50 ఏళ్లగా సంప్రదాయ దోవతి కమీజు ధరిస్తున్న. హైదరాబాదులోని నిజాం కాలేజీలో 1969లో విద్యాభ్యాసం ముగిసింది. ప్రభుత్వ కార్యాలయాలు, వేడుకలు, ఎక్కడికి వెళ్లినా దోవతి, కమీజు వేసుకుంటా. 1981 నుంచి 1993 వరకు ఇల్లంతకుంట సర్పంచ్‌గా చేసిన.

– చిట్టి కృష్ణారెడ్డి, ఇల్లంతకుంట

ఊరంతా తిరిగి ఆడుకునే వాళ్లం



మా చిన్నతనంలో ఉగాది పండగ వచ్చిందంటే ఊరంతా తిరిగి ఆడుకునే వాళ్లం. కుడుకల పేర్లు, బచ్చీల పేర్లు మెడలో వేసుకుని సంబురంగా తిరిగేటోళ్లం. గుడికాడికి వెళ్లి పంచాంగం వినేటోళ్లం. ఇలా ఊరంతా అక్కడికి వచ్చి ఎంతో సంతోషంగా పండుగ జరుపుకునేది. ఇప్పుడు ఆ ఉత్సాహం లేదు.. ఉల్లాసం లేదు. ఏమైనా సెల్ ఫోన్ చూస్తూ.. మనుషులు పరాయివాళ్ల లాగే ఉంటున్నారు. మా రోజుల్లో ఉగాది పండగ అంటే ఏడాదికో దినం. పిల్లల అంతా కలిసి సంబురంగా ఆటలు ఆడేది.

-భానోత్ గన్యానాయక్, చిన్నబోనాల, సిరిసిల్ల

45 వసంతాలుగా..



యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడిని. 45 ఏళ్ల నుంచి ఉగాది నాడు పంచాంగా శ్రవణం వినిపిస్తున్న. విశ్వవసు నామ సంవత్సరంలో ప్రజలు ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతారు. ఆధ్యాత్మికత పెరుగుతుంది. సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులు, ఉద్యోగులు, అధికారుల మధ్య విశ్వాసం కలిగి ఉంటారు. లోక కల్యాణార్థం యాగాలు, హోమాలు చేయడం జరుగుతుంది. రైతులు పంటలు అధికంగా పండిస్తారు. – జగన్నాథచార్యులు, యైటింక్లయిన్‌కాలనీ

ఊరంతా పండుగే..



సిరిసిల్ల: వేములవాడ మండలం రుద్రవరం సొంతూరు. మా ఊరిలో ఉగాది పండగ రోజు ఊరంతా పండుగే. కుల, మత బేధాలు లేకుండా అందరూ పండుగ జరుపుకునే వారు. కాడెద్దులకు, కచ్చురాలకు జాజు పూసి, సున్నం బొట్లు పెట్టి వ్యవసాయ ప్రారంభోత్సవ పండగ చేసేవాళ్లం. పంచాంగ శ్రవణం విని ఏడాది పొడువునా వర్షాలు ఎలా ఉన్నాయి.. తదితర అంశాలపై ఆసక్తిగా చర్చించుకునే వాళ్లం. ఆ రోజులే వేరు.

– రేగులపాటి పాపారావు, మాజీ ఎమ్మెల్యే, సిరిసిల్ల

కొత్త బట్టలతో మురిసిపోయేటోళ్లం



మాది సొంతూరు బెజ్జంకి దగ్గర దాచారం. నేను పుట్టక ముందే మా నాన్న సిరిసిల్లకు వచ్చాడు. నేను ఇక్కడే పుట్టాను. నా వయసు ఇప్పుడు 63 ఏళ్లు. మా చిన్నప్పుడు ఉగాది పండగ అంటే.. ఇంట్లో కొత్త బట్టలు కుట్టించేవాళ్లు. అవి వేసుకుని మురిసిపోతూ పంచాంగ శ్రవణం వినేవాళ్లం. ఉగాది పచ్చడి ఆకులల్ల పోసేటోళ్లు. ఎంతో సంతోషంగా అది తాగేటోళ్లం. ఇంట్లో పోలెలు చేస్తే.. ఇద్దరు అక్కలు, ఒక చెల్లె, అన్నతో కలిసి ఇంట్లో సంబురంగా తినేవాళ్లం. ఉగాది పండగ అంటే ఇంటిల్లిపాదికి ఎంతో ఆనందం ఉండేది.– డాక్టర్ గాజుల బాలయ్య, విద్యానగర్, సిరిసిల్ల

ఆ ఉత్సాహమే లేదు



ఉగాది రోజున స్నానాలు చేసి పొద్దుగాలనే పొలంకాడికి పోయేవాళ్లం. వేప పువ్వు, మామిడికాయలు, మామిడి ఆకు, కొత్త చింతపండు తీసుకుని వచ్చి కొత్త కుండలో ఉగాది పచ్చడి చేసేవాళ్లు. కొబ్బరికాయ కొట్టి పచ్చడి పెట్టే దాకా ఇంట్లో నుంచి బయటకు వెళ్లకపోయేది. బక్ష్యాలు తిని వెళ్లి పంచాంగం వినేవాళ్లం. వచ్చే ఏడాదంతా ఎలా ఉంటుంది. ఏ రాశి వారికి రాబడి ఎంత.. ఖర్చు ఎంత..? తెలుసుకుని మురిసిపోయే వాళ్లం. ఈ రోజుల్లో ఆ ఉత్సాహమే లేదు.

– భైరి ప్రభాకర్, వెంకంపేట, సిరిసిల్ల

స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందేలా ప్రభుత్వం కృషి

- రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ వెన్నెల


ప్రతిజ్ఞ చేస్తున్న వెన్నెల, విప్ శ్రీనివాస్

కథలాపూర్: స్వాతంత్ర్య స్వేచ్ఛ ఫలాలు అందరికీ అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ వెన్నెల అన్నారు. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే దేశం అభివృద్ధి చెందిందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక నియంతృత్వ పోకడలతో పరిపాలన చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ దేశంలోని వివక్షను రూపుమాపేందుకు కృషి చేస్తున్నారన్నారు. దేశంలో పేద ప్రజలకు ఉపయోగపడే ప్రతీ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రారంభం చేసిందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో దక్షిణాది రాష్ట్రాల్లో ఎంపీ స్థానాలు తగ్గించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఎండీ.ఆవేజ్, పీసీసీ కార్యవర్గసభ్యుడు తొట్ల అంజయ్య, ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, వాకిటి రాజారెడ్డి, వంగ మహేశ్, జవ్వాజి చౌదరి, గడ్డం చిన్నారెడ్డి, కల్లెడ గంగాధర్, వేముల కృష్ణ, కూన అశోక్ పాల్గొన్నారు.

సాయం చేయబోతే ప్రాణమే పోయింది


కుటుంబ సభ్యులతో వంశీధర్(ఫైల్)

మల్యాల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి సాయం చేయబోయిన యువకుడు బైక్ ఢీకొని మృతి చెందాడు. మండలంలోని గొర్రెగుండ గ్రామానికి చెందిన వంశీధర్‌రావు జగిత్యాలలో కొరియర్‌గా పనిచేస్తున్నాడు. తన మిత్రులతో కలిసి ఒక శుభకార్యంలో పాల్గొని ఇంటికి తిరిగి వెళ్తుండగా శుక్రవారం రాత్రి జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారిపై మధుర నరేశ్ అనే ద్విచక్ర వాహనదారుడు అదుపుతప్పి కిందపడి, గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న వంశీధర్ తన బైక్‌ను రోడ్డు పక్కన నిలిపి, లేవలేని స్థితిలో రోడ్డుపై పడిన నరేశ్‌కు సాయం చేసేందుకు వెళ్లాడు. అదే సమయంలో పల్లెపు రాజేశ్ బైక్‌పై అతివేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వంశీధర్‌ను జగిత్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. గొర్రెగుండెంలో దహన సంస్కారాలు నిర్వహించారు. వంశీధర్‌కు భార్య జ్యోతి, నాలుగేళ్ల కుమారుడు, రెండేళ్ల కూతురు ఉన్నారు. వంశీధర్ తల్లిదండ్రులు గతంలోనే మృతిచెందారు. సోదరుడు అనిల్ 15 ఏళ్ల క్రితం నూకపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నాలుగేళ్ల కుమారుడు తండ్రి చితికి నిప్పటించడం స్థానికులను కంటతడి పెట్టించింది.